క్లుప్తంగా

ఆర్థికసాయం



కాశిబుగ్గ: నగరంలోని 35వ డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన సింగారపు ప్రవళిక, ఎండీ. బాబాల కూతురు అమీనా గత కొన్ని నెలలుగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఈ విషయాన్ని డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె చిన్నారి వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చు రూ.లక్ష 15 వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఈ చెక్కును శివ ఆదివారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, కాగితోటి సోమన్న, కొత్తూరు రాజు, తాళ్లపల్లి బాలుగౌడ్, రామా రఘునాథ్, జావీద్, రాజకుమార్‌లు పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీ



హసన్‌పర్తి : వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి నగరానికి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ (అమృత్ పథకం) పైప్‌లైన్ లీకైంది. సప్తగిరి కాలనీ సమీపంలోని కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద ప్రధాన పైప్‌లైన్‌కు రంధ్రం పడింది. దీంతో నీరంతా వృథాగా పోతుంది. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఎమ్మెల్యే నాగరాజు స్పందించి పనులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాగ్బాట ఆత్మీయ సమ్మేళనం

ఖిలా వరంగల్: రంగశాయిపేట వాగ్బాట యోగా అండ్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కుటుంబ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ హంటర్ రోడ్డు బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాల ప్రాంగణంలో అధ్యక్షుడు పెసర నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథులుగా రహీమ్, డైరెక్టర్ ఆఫ్ పాత్ ఫైండర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. వాగ్బాట యోగా, వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరూ కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పెరుమాండ్ల మధు, మార్గం నవీన్‌కుమార్, రాంచందర్, శ్రీశైలం,సాంబన్న, రవీందర్, మోహన్, నవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.

కేజ్ వీల్స్ రోడ్డెక్కితే సీజ్

హసన్‌పర్తి: కేజ్ వీల్స్ రోడ్డెక్కితే సీజ్ చేస్తామని పోలీసులు కేజ్ వీల్స్ యజమానులకు హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కేజ్ వీల్స్ కలిగి ఉన్న యజమానులకు స్థానిక సీఐ సురేశ్ పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో రైతులు ఎక్కువశాతం కేజ్ వీల్స్‌ను ఉపయోగిస్తుండడంతో రోడ్డు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

రెండు కేజ్ వీల్స్ స్వాధీనం...

మండలంలోని ముచ్చర్ల, మడిపల్లి గ్రామాల్లో రోడ్లపై కేజ్ వీల్స్ తీసుకెళ్తుండగా గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. రెండింటిని సీజ్ చేసి వాటిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్రాయిని పునఃప్రతిష్ఠించుకుందాం

కాజీపేట అర్బన్ : 31వ డివిజన్ న్యూశాయంపేటలోని గ్రామ దేవత బొడ్రాయిని పునఃప్రతిష్ఠించుకుందామని కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. న్యూశాయంపేటలోని ఆదివారం గ్రామస్తులంతా ఐక్యంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గ్రామస్తులమంతా ఐక్యంగా బొడ్రాయి స్థలాన్ని ఎంపిక చేసుకుని, పూజారులతో వైభవంగా బొడ్రాయి ప్రతిస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాడిశెట్టి శివశంకర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

గుంతలమయంగా కోట రహదారి



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలా వరంగల్ పడమరకోట ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. కోటకు వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు పర్యటించి కోట ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రయాణం నరకం

- మడికొండ- ధర్మసాగర్ రోడ్డు అంటే జంకుతున్న వాహనదారులు
- పది మీటర్లకు ఒక గుంత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మడికొండ - ధర్మసాగర్ రోడ్డుపై ఏర్పడిన గుంత



ఇటీవల గుంతలో పడి బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

మడికొండ: మడికొండ-ధర్మసాగర్ రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహనదారులు జంకుతున్నారు. మడికొండ గ్రామం నుంచి ధర్మసాగర్ వరకు పది మీటర్లకు ఒక గుంత దర్శనం ఇస్తుంది. దీనికి తోడు భారీ వాహనాలు రావడంతో గుంతలు పెద్దగా ఏర్పడి వాటిలో వాహనాలు సైతం బోల్తా కొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమస్య వచ్చిన సమయంలోనే రెండు, మూడు రోజులు స్థానిక పోలీసులు భారీ వాహనాలు రాకుండా చూస్తున్నారు. అనంతరం సమస్య యథాతథంగా మారుతుంది. ఒక్కో గుంత సుమారు అర ఫీట్ లోతు ఉంది. వర్షపు నీరు అందులో నిలిచిపోవడంతో గుంతలో వాహనదారులు పడిపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బంది



మడికొండ-ధర్మసాగర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాల రాకతో గుంతలు పెద్దగామారుతున్నాయి. – ఎలిశాల మహేష్, స్థానికుడు

పారిశుద్ధ్యంపై స్పందించని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవటంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌లను నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన ఊరు – మన బడి పథకం కింద పాఠశాలల్లో ప్రారంభమైనా పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేజీబీవీల్లోని టీచర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, జిల్లా జనరల్ సెక్రటరీ గొడిశాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, గొడిశాల రమేష్, జిల్లా కార్యదర్శులు అన్నారెడ్డి, రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్, బాధ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉద్యమనాయకులు

వరంగల్ చౌరస్తా : తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి కోరారు. ఆదివారం వరంగల్ అండర్‌బ్రిడ్జి ఓంకార్ భవన్ ఎదుట తెలంగాణ ఆకాంక్షల వేదిక వరంగల్ అర్బన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా యుద్ధనౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ ప్రథమ వర్ధంతి, చుండూరు అమరవీరుల 33వ వర్ధంతి సంస్మరణ సభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క ఉద్యమకారుల సదస్సులో ఇచ్చిన మాట ప్రకారం.. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించుటకు ఈ అసెంబ్లీ సమావేశంలో కమిటీ వేయడానికి నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోధుమల కుమార్ స్వామి, ధర్మపురి రామారావు, ఐతమ్ నగేష్, నలిగంటి చంద్రమౌళి, శరత్, కొమురయ్య, సోమిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలతో సమసమాజ స్థాపన



సిల్వర్‌జూబ్లీ వేడుకలో మాట్లాడుతున్న ఫాదర్ తాటికొండ జోసెఫ్

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు బోధనలతో సమసమాజ స్థాపన నిర్మాణానికి ఆయన చూపిన మార్గంలో పయనించేందుకు అందరం కృషి చేయాలని ఫాతిమా పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాటికొండ జోసెఫ్ అన్నారు. కాజీపేట వెంకటాద్రినగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు పాస్టర్ కె.పీటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జోసెఫ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలు కోపం, పగ విడనాడి ఒకరిపట్ల ఒకరు ప్రేమతో జీవిస్తూ దేవుని యందు జీవితాలను ఆధునీకీకరణ చేసుకోవాలని ఆయన అన్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కె.పీటర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి చేయూతనివ్వాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రాజు, ఆనందరావు, సిహెచ్.రవి, గాబ్రియల్, ఇమ్మాన్యుయేల్, చర్చి డెలిగేట్ పి.సంపత్‌కుమార్, రాజేష్, విద్యాసాగర్, సునిల్, చర్చి కమిటీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్‌లోని రామకృష్ణకాలనీ, శ్రీరాంనగర్ కాలనీల సమస్యలు పరిష్కరించాలని కాలనీ కమిటీ బాధ్యులు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లును కోరారు. ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆదివారం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు. అనంతరం స్థానికంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని కాలనీవాసులు కోరగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో నిధులు తీసుకొచ్చి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ స్థానికులకు భరోసా కల్పించారు. కోల సురేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దిడ్డి నాగభూషణం, సూరం సమ్మయ్య, మేడిశెట్టి కుమార్, దూలం వెంకట్, నాగశంకర్, శివ, దిల్ యా లాద్రి ప్రభాకర్, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ యంత్రం

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువుకట్టను క్లీన్ చేశారు. కొంతకాలంగా ఈ కట్టపై ముళ్ల పొదలు కూరకుపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కల్లు గీసేందుకు గీతకార్మికులు ఈ కట్టను వినియోగించుకుంటున్నారు. అయితే ముళ్ల పొదలతో ఇక్కట్లకు గురవుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం జక్కుల రజిత ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో ముళ్ల పొదలను తొలగించారు.

కట్టపై తాటి వనం

కట్టపై తాటి వనం పెంచుతాని కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో కట్టపై మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ సిబ్బంది సురేష్, మహేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మామునూరు: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని మామునూరు ఎస్సై కృష్ణవేణి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఏసీపీ తిరుపతి ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బొల్లికుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై కృష్ణవేణి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కాజీపేట : పట్టణంలో ఉన్న ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య అన్నారు. ఆదివారం కేవీపీఎస్ కార్యకర్తలు హాస్టల్‌కు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలపై విద్యార్థులతో చర్చించారు. హాస్టల్‌లో దోమలబెడదతో పాటు భవనం క్రమేపీ శిథిలావస్థకు చేరుతుందని గుర్తించారు. హాస్టల్ సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సారంగపాణి, గణేష్, రమేష్, లింగన్న, అనిత తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సంక్షేమమే ధ్యేయం



ఖిలా వరంగల్: సభ్యుల సంక్షేమంతో పాటు సామాజిక సేవా రంగంలో ముందుందామని అన్నపూర్ణ పరపతి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బిట్ల సుధాకర్, బండి కోటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలానగర్‌లోని అన్నపూర్ణ పరపతి సంఘం భవనంలో జరిగిన సర్వ సభ్యసమావేశంలో వారు మాట్లాడారు. సభ్యుల అభ్యున్నతి కోసం సంఘం దోహదపడుతుందని తెలిపారు. తక్కువ వడ్డీతో సాధారణ రుణం కింద రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు ఇవ్వనున్నామని చెప్పారు. అనంతరం కార్యవర్గ సభ్యులు బిట్ల కుమారస్వామి, సుధాకర్, శ్రీహరి, సింగం అశోక్, మల్లికార్జున్, రాజశేఖర్, తోట మల్లయ్య కుటుంబాలను సన్మానించారు. సంఘం సహాయ కార్యదర్శి తోట చందర్, కోశాధికారి ఝినబోతుల సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాయమల్లు, కత్తి కుమారస్వామి, రమేష్, శ్రీధర్, వీరభద్రయ్య, నర్సయ్య, నరసింహులు, ప్రేమ్‌సాగర్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, ఇనుముల మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన కొండపెల్లి షకీల్, స్వప్న దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఇటీవల షకీల్ తన భార్యతో గొడవ పెట్టుకుని ఈనెల 21న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో భార్య స్వప్న బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికింది. ఆచూకీ ఎక్కడ లభించకపోవడంతో ఆదివారం మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: బైక్‌తో తల్లికుమార్తెను ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..చింతల్ చంద్రవదన కాలనీకి చెందిన నరిగె లక్ష్మీ, కుమార్తె కావ్య ఇద్దరు కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆటోదిగి ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో ఆదే కాలనీకి చెందిన గుండు నిఖిల్ బైక్‌పై వెళ్తూ తల్లికుమార్తెలను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలు నరిగె లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నటు సీఐ తెలిపారు.

కాశిబుగ్గలో మైసమ్మ బోనాలు



వరంగల్: కాశిబుగ్గ శ్రీవివేకానందపురి వీధిలో ఆషాఢమాస మైసమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు, బోనాలతో వీధిలోని మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సముద్రాల రాములమ్మ, గోసికొండ శాంతమ్మ, విజయ, భాగ్యలక్ష్మీ, రమ, జ్యోతి, డాక్టర్ మహిత, స్వాతి, జయ, లలిత, నాయకులు పరమేశ్వర్, హరిశంకర్, శ్రీను, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆశ’లను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: ఆశ కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాస్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆశ కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా అమలు చేయకుండా అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క అంశాన్ని రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదని తూర్పారబట్టారు. రాబోయే కాలంలో అందరినీ ఏకం చేసి వారి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఆశ కార్యకర్తల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని, చిల్లర మల్లర యూనియన్‌ల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, నాయకులు శివకుమార్, మంజుల, జి.యువరాజు పాల్గొన్నారు.

కాజీపేటలో బోనాల సందడి



మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



బోనాలతో నృత్యం చేస్తున్న హిజ్రాలు

- ఘనంగా మహంకాళీ జాతర
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

కాజీపేట : 63వ డివిజన్ సోమిడిలోని మహంకాళీ దేవాలయంలో ఆదివారం బోనాల జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ ఆలయంలో ఆషాఢమాసం చివరి ఆదివారం ఎంతో అట్టహాసంగా నిర్వహించే ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ పూజారి ముత్యాల సరస్వతి, రాజులు నెలరోజులపాటు ఎంతో నిష్టగా ఉపవాస దీక్ష చేపట్టి ప్రత్యేక పూజలు కొనసాగించారు. తెల్లవారుజామునుంచే ప్రజలు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు భక్తిభావంతో బోనాలు వండుకుని వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు మేకలు, కోళ్ల కోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పురవీధుల్లో అమ్మవారిని ప్రత్యేక రథంపై ఊరేగించారు.

పుర ప్రముఖుల పూజలు...

మహంకాళీ రథయాత్రను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిలు లాంఛనంగా ప్రారంభించారు. అమ్మవారిని కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ఎండి అంకూస్, గుంటి కుమారస్వామి, గుర్రపు కోటేశ్వర్, సందెల విజయ్, అస్గర్, భరత్‌తో పాటు రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కళాకారుల నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

సమాజంలో విద్య అత్యంత విలువైనది



మాట్లాడుతున్న బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ లత

కాజీపేట రూరల్ : సమాజంలో విద్య అత్యంత విలువైందని, విద్యతో మనిషికి విలువ, గౌరవం పెరుగుతుందని బాలవికాస సంస్థ ప్రోగ్రాం మేనేజర్ లత అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం 220 మంది అనాథ బాలబాలికలకు (వికాసబాలబాలికలు) ఆర్థికసాయంతో పాటు విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, ఇతర సామాగ్రి వస్తువుల పంపిణీ, విద్య అవశ్యకత కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో లత మాట్లాడుతూ బాలవికాస అందిస్తున్న సహకారంతో వికాస బాలబాలికలు ఎంతో ఉన్నత శిఖరాలను అందుకోవడంతో పాటు తోటి వారికి సహకరించాలని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బాలవికాస నిర్వహిస్తున్న మహిళాభివృద్ధి పథకంలో భాగంగా సుమారు 1600 మంది అనాథ బాలబాలికలను అక్కున చేర్చుకొని వారి విద్య, అవసరాలకు కావల్సిన సదుపాయాలు కల్పిస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో బాలవికాస మహిళా ప్రోగ్రాం నుంచి జ్యోతి, సుజాత, అమూల్య, బాలవికాస ఐటీ ప్రోగ్రాం మేనేజర్ శివరాం, 9 జిల్లాల నుంచి ఎల్‌కేజీ నుంచి పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదుర్గా కాలనీలో గోరింటాకు పండుగ



గోరింటాకు చేతులకు పెట్టుకుని ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ గుజ్జుల వసంత, కాలనీ మహిళలు

హన్మకొండ: హనుమకొండలోని కనకదుర్గా కాలనీలో మహిళలు గోరింటాకు పండుగ జరుపుకున్నారు. ఆదివారం కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఆషాఢమాసం సందర్భంగా ఆడపడుచులకు ఇష్టమైన గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. గోరింటాకు కొమ్మలు తీసుకువచ్చి ఆకులు వేరుచేసి అక్కడే రోట్లో వేసి నూరి ముద్దగా తయారు చేసి ఒకరికొకరు ఆప్యాయతలు పంచుకుంటూ చేతులకు పెట్టుకున్నారు. ఇలా పెట్టుకోవడం వల్ల ఆ రోగ్యం, సౌభాగ్యం వస్తుందని మహిళల నమ్మకం. దీని ద్వారా అందం కూడా వస్తుంది. వరంగల్ మహానగర పాలక సంస్థ 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత పాల్గొని మాట్లాడుతూ మన సంస్కృతిలో గోరింటాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇది ఏళ్ల తరబడి వస్తున్న సంప్రదాయమన్నారు. గోరింటాకు అంటే ఇష్టముండని మహిళలుండరన్నారు. గోరింటాకుతో అనేక ప్రయోజనాలున్నాయని వివరించారు.


మడికొండలో అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మడికొండ : మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యాబోధన చేసిన నాటి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. 32 ఏళ్ల తర్వాత 110 మంది మిత్రులు ఒక చోట కలుసుకుని నాటి మిత్రులతో జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో బి.రాజు, కె.నర్సయ్య, మోహన్, కృష్ణ, శ్రీను, భాగ్య, రమ, సరిత, సంతోష్, రవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు చివరలో బ్రిడ్జి అందుబాటులోకి



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి పనులు చివరి దశకు చేరుకున్నాయని, రెండోదశ పనులు పూర్తి కావస్తున్నాయని ఆగస్టు చివరి వారం వరకు బ్రిడ్జి పనులు పూర్తయితే రవాణాకు సిద్ధంగా అందుబాటులోకి వస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యం అందించడానికి నాణ్యత ప్రమాణాల్లో ఎటువంటి లోటుపాటు లేకుండా పనులు జరగాలని ఆదేశించారు. తేలికపాటి వర్షాలకే పెద్ద మోరీ కూరుకుపోతుందని, కోతలకు గురైన ప్రదేశాలను, నాలాను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి పనులు జరుగుతున్నాయన్నారు.